పర్యావరణ హితుడు.. ఈ గణేశుడు

- 30 ఏళ్లుగా మట్టి గణపయ్యనే పూజిస్తున్న ఎస్పీఆర్ హిల్స్ ఇందిరానగర్ ఫేస్-2 మండప నిర్వాహకులు
- ఈ యేడూ ఆచరణ.. పలువురికి ఆదర్శం

బోరబండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగకు పర్యావరణ హితమైన మట్టి వినాయకుడిని పూజిస్తున్నారు. ఇందుకు ఎస్పీఆర్ హిల్స్ ఇందిరానగర్ ఫేస్-2 మండప నిర్వాహకులు ఆదర్శంగా నిలుస్తున్నారు. గడిచిన 30 ఏళ్లుగా ఈ ప్రక్రియనే నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన పుట్టమన్ను, వరిగడ్డితో బస్తీలోని షిరిడీ సాయిబాబా, ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో బస్తీకి చెందిన కళాకారుడు బండారి కృష్ణాచారి బొజ్జ గణపయ్య ప్రతిమను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. పర్యావరణానికి చేటు చేయని సహజ రంగులు ఉపయోగించి నవరాత్రి వేడుకల కోసం ప్రతిమను ముస్తాబు చేస్తున్నారు. బస్తీ ఏర్పడిన 1992 నుంచి గణపతి వేడుకలు నిర్వహిస్తున్నామని, 1996 నుంచి పర్యావరణహిత మట్టి గణపతిని తయారు చేస్తున్నామని ఆలయ ధర్మకర్త వేముల యాదయ్య తెలిపారు.


ఎస్పీఆర్ హిల్స్ ఇందిరానగర్ ఫేస్-2లో మట్టితో రూపొందిస్తున్న గణపతి ప్రతిమ

నిమజ్జనమూ ప్రత్యేకమే

వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన మట్టితో గణపతి విగ్రహాన్ని తయారు చేయడమే కాకుండా, నిమజ్జనం కూడా ప్రత్యేకంగా జరిపి నిర్వాహకులు ఆకట్టుకుంటున్నారు. కాశీ నుంచి తెచ్చిన గంగా జలం, రామేశ్వరం సముద్ర జలాలతోపాటు గోదావరి, కృష్ణా, తుంగభద్ర నదీ జలాలను తీసుకొచ్చి విగ్రహం ఉన్నచోటే నిమజ్జనం చేస్తారు. ఎంతో భక్తి, శ్రద్ధలతో పూజించిన వినాయక విగ్రహాన్ని కలుషిత జలాలలో నిమజ్జనం చేయడం సరికాదని, అందుకే పవిత్ర జలాలతో నిమజ్జనం చేస్తామని బస్తీ వ్యవస్థాపక అధ్యక్షుడు యాదయ్య వెల్లడించారు. నిమజ్జనం అనంతరం ఆలయ ప్రాంగణం నుంచి స్థానిక భక్తులు మట్టిని సేకరించి తమ ఇళ్లలోని తులసికోటలో వేసుకుంటారు. విగ్రహాన్ని రూపొందించిన చోటే పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జనం జరిగే వేడుకలు బహుశా ఇందిరా నగర్ ఫేస్-2లోనే కావచ్చునని భక్తులు పేర్కొంటున్నారు.


ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్‌ను సత్కరిస్తున్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ప్రతినిధులు

ఇస్రో చైర్మన్‌కు సత్కారం

ఖైరతాబాద్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఇస్రోను ప్రపంచంలోనే నంబర్ 1గా తీర్చిదిద్దుతామని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంచి సహకారాన్ని ఇస్తున్నారని చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చౌహన్, ఇస్రో విశ్రాంత డైరెక్టర్ వి. శేషగిరిరావుతో పాటు ఆయన్ను ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ తెలంగాణ రాష్ట్ర శాఖ తరఫున సత్కరించారు. ఈ సందర్భంగా నారాయణన్ మాట్లాడుతూ తన హయాంలో ఇస్రోను ప్రపంచంలోనే నంబర్ 1గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఈఐ చైర్మన్ డాక్టర్ వెంకట సుబ్బయ్య, విశ్రాంత చైర్మన్లు డాక్టర్ రామేశ్వర్‌రావు, బ్రహ్మారెడ్డి, కార్యదర్శి సీతారాంబాబు, డాక్టర్ రమణ నాయక్, కార్యదర్శి మర్రి రమేష్, ప్రతినిధులు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఐఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ వలలో హైడ్రా ఉద్యోగి

- పోగొట్టుకున్న నగదు రూ. 99వేలు

బోరబండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సైబర్ కేటుగాళ్ల వలలో హైడ్రా ఉద్యోగి చిక్కుకుని నగదు పోగొట్టుకున్నారు. బోరబండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎస్పీఆర్ హిల్స్ టి.అంజయ్య నగర్‌కు చెందిన సీహెచ్. అన్వేష్ హైడ్రా డి.ఆర్.ఎఫ్. విభాగంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి. తన మొబైల్‌లో యోనో యాప్ ఇన్ స్టాల్ చేసి డౌన్ లోడ్ చేయగానే ఓటీపీ వచ్చింది. ఆ ఓటీపీ గురించి ఎవరికీ చెప్పకుండానే అన్వేష్‌కు చెందిన ఎస్.బి.ఐ. మోతీనగర్ శాఖ నుంచి రూ. 49 వేలు, వెంటనే ఇంకొక రూ. 50వేలు విత్ డ్రా చేసినట్లు ఫోన్‌కు సందేశం వచ్చింది. హుటాహుటిన బాధితుడు 1930కు, బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.


మాట్లాడుతున్న పార్లమెంట్ మాజీ సభ్యుడు అంజన్‌కుమార్‌యాదవ్

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ జెండా ఎగరవేద్దాం

యూసుఫ్ గూడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ కాంగ్రెస్‌కు అడ్డా అని, ఉపఎన్నికలో పార్టీ జెండా ఎగురవేద్దామని మాజీ పార్లమెంట్ సభ్యుడు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్‌యాదవ్ అన్నారు. కృష్ణానగర్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం సీనియర్ నాయకులు ఈఎల్ రామయ్య ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను కాంగ్రెస్ పార్టీ కల్పిస్తోందన్నారు. సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, నాయకులు, కార్యకర్తలు ఈఎల్ రామయ్య, ఎర్ర కృష్ణ, మోసిన్ ఖురేషి, కిరణ్ యాదవ్, సలీం, గాలయ్య , లక్ష్మీరెడ్డి, పద్మ, రాధిక, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

గణపయ్య ఆగమన వేడుకలు

బోరబండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారత్ మాతా యూత్ అసోసియేషన్ రజతోత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేకంగా త్రిమూర్తి అవతార గణేశుడి విగ్రహాన్ని రహమత్ నగర్‌లో ఏర్పాటు చేయనున్నారు. ఘట్కేసర్‌లో కళాకారులతో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన 15 అడుగుల ఈ విగ్రహ ఆగమన వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. 2001లో ప్రారంభమైన తమ సంఘం తరఫున యేటా గణపతి నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు భారత్ మాత యువత అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ కుమార్, మేనేజర్ వంశీకృష్ణ తెలిపారు. వేడుకలలో భాగంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు మండపాన్ని సందర్శించి పూజలు చేస్తారని చెప్పారు. సంఘం ప్రతినిధులు ప్రశాంత్, గోపి, శ్రీకాంత్, అజయ్, సూర్య, నవీన్, వినయ్ కుమార్ సహకారంతో వేడుకలు వైభవంగా నిర్వహిస్తామని వెల్లడించారు.


రహమత్ నగర్‌లో ఏర్పాటు చేయనున్న త్రిమూర్తి గణేశుడు


మంత్రి వివేక్ సమక్షంలో నినాదాలు చేస్తున్న రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బి.భవానీ శంకర్, కాంగ్రెస్ కార్యకర్తలు

సయోధ్య కుదిరినట్లేనా?

బోరబండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్‌లో రెండేళ్లుగా కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బి.భవానీశంకర్ వర్గాల నడుమ కొనసాగుతున్న విబేధాలు తొలగించేందుకు మంత్రి వివేక్ వెంకటస్వామి చేసిన ప్రయత్నం సఫలమైనట్లే కనిపిస్తోంది. ఆదివారం రాత్రి ఇరువర్గాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు మంత్రి సమక్షంలో జరిగిన సమావేశంలో బాహాబాహీకి దిగడం విదితమే. ఇరువైపుల ఉన్న నాయకులు, అనుచరులను సోమవారం రాత్రి మంత్రి కలిసి సముదాయించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తరుణంలో ఇటువంటి సంఘటనలు కార్యకర్తల్లో తప్పుడు సంకేతాలు పంపే అవకాశలుండటంతో పాటు, పార్టీకి నష్టం కలిగిస్తాయన్నారు. కలిసికట్టుగా కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి పాటుపడాలని సూచించారు. మంత్రి సూచన మేరకు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి పాటు పడతామని ఇరువర్గాలు వారు ఆమోదం తెలిపారు. మంత్రి సమక్షంలో భవానీ, సీఎన్ నినాదాలు చేశారు. అయితే ఇరువర్గాలు కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటాయా? అన్న సందేహాలు పార్టీ వర్గాల్లో నెలకొంది.

కేబీఆర్ పార్కు చెరువు నుంచి భూగర్భ పైప్‌లైన్

- మంత్రి పొన్నం ప్రభాకర్

బంజారాహిల్స్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కేబీఆర్ పార్కు చెరువు నుంచి వరద నీరు వెళ్లేందుకు భూగర్భ పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. వరుస వర్షాల నేపథ్యంలో బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు చెరువులు నిండి వరద నీరు జూబ్లీహిల్స్ చెక్‌పోస్టుకు వెళ్లే రోడ్డుపై నిలిచింది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. మంగళవారం వాటర్ లాగింగ్ పాయింట్‌ను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, ఏసీపీ కట్టా హరిప్రసాద్‌తో కలిసి ఆయన పరిశీలించారు. నీరు రోడ్డుపైకి వచ్చి ఎన్‌టీఆర్ ట్రస్టు భవన్ వరకు ప్రవహిస్తున్నట్టు గమనించారు. ఈ నీరు వెళ్లేందుకు భూగర్భ పైప్‌లైన్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్‌కు ఆటంకాలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు.


కేబీఆర్ పార్కు వద్ద వాటర్ లాంగింగ్ పాయింట్‌ను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం, మేయర్ విజయలక్ష్మి, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, ఏసీపీ కట్టా హరిప్రసాద్

నవరాత్రులు, నిమజ్జనం శాంతియుతంగా జరుపుకోవాలి

- ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి

బంజారాహిల్స్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రులు, నిమ్మజ్జన వేడుకలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని బంజారాహిల్స్ డివిజన్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి అన్నారు. ఫిలింనగర్ 18 బస్తీల వినాయక మండపాల ఉత్సవ కమిటీలతో మంగళవారం గౌతంనగర్ కమ్యూనిటీహాల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా స్థానిక పోలీసులకు మండపాలు ఏర్పాటు చేస్తున్న ప్రాంతాల వివరాలు తెలియజేయాలన్నారు. విద్యుత్ కనెక్షన్లు సరైన పద్ధతిలో తీసుకోవాలన్నారు. రోజూ మండపాల వద్ద ఒకరు లేదా ఇద్దరు కాపాలా ఉండాలన్నారు. దీపాలు, కొవ్వొత్తులు మండపాల వద్ద లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుమానితులు కనిపిస్తే 100కు డయల్ చేయడం, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడం చేయాలన్నారు. రాత్రి వేళలలో భజ నలు చేసే వారు పోలీసులు సూచించిన సమయానికే మైకులు బంద్ చేయాలన్నారు. ప్రజలు ఇబ్బంది కలిగించేలా మైక్ సెట్‌లు, డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎవరైన అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వినాయక విగ్రహాల తరలింపు సమయంలో గోతులు పడ్డ రోడ్ల వద్ద జాగ్రత్తగా ఉండాలన్నారు. సమావేశంలో ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ సంతోషం , జిహెచ్ఎంసీ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ హర్షద్, ఫిలింనగర్ ఎలక్ట్రిసిటీ ఏఈ పవిత్ర, ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మావిడి నర్సింగ్ రావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి

రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను తిప్పికొడదాం

పంజాగుట్ట, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): దేశంలో రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను తిప్పికొడదామని, గ్రామగ్రామానికి రాజ్యాంగాన్ని తీసుకెళ్దామని అఖిల భారత ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కె. మహేశ్వర్ రాజ్ అన్నారు. సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 17న రవీంద్రభారతిలో నిర్వహించిన ది మిషన్ టు సేవ్ ది కానిస్టిట్యూషన్ సదస్సుకు మంచి స్పందన వచ్చిందని, దీనిని విజయవంతం చేసినందుకు ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమాఖ్య ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న అన్ని గ్రామాల్లో, పట్టణాల్లోని బస్తీలు, కాలనీలలో సమావేశాలు ఏర్పాటు చేసిన అందరికీ రాజ్యాంగాన్ని, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీ చేస్తామన్నారు. అన్నింటికీ రాజ్యాంగం మూలమని, దీనిని మార్చి మను ధర్మ శాస్త్రాన్ని తేవాలని ఆర్ఎస్ఎస్, బీజేపీలు చూస్తున్నాయన్నారు. దానిని అడ్డుకుందామన్నారు. రాజ్యాంగం అనేది లేకపోతే మనకు సమానత్వం, స్వేచ్ఛ, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు ఉండేవి కావన్నారు. త్వరలోనే తెలంగాణ వ్యాప్తంగా రాజ్యాంగ పరిరక్షణ యాత్ర చెప్పట్టనున్నట్టు తెలిపారు. సమావేశంలో సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ కెతావత్ రామకృష్ణ, ముఖ్య న్యాయ సలహాదారు జి.ఆనంద్, పీవీ రమణ,సమాఖ్య మహిళా విభాగం కో కన్వీనర్లు పి.చంద్ర ప్రభ, పి.సుశీల కుమారి, నాయకులు శేఖర్,దుర్గేష్ నందిని, పుష్పావతి, సరస్వతి,నాగజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.


రాజ్యాంగాన్ని ప్రదర్శిస్తున్న అఖిల భారత ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వర్ రాజ్, సమాఖ్య ప్రతినిధులు

ఎర్రగడ్డ ఆయుర్వేద ఆస్పత్రిలో నిధుల గోల్‌మాల్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో రోగుల డైట్ పేరుతో లక్షల రూపాయల గోల్‌మాల్ జరిగిన ఉదంతం ఆలస్యంగా వెలుగుచూసింది. ఇటీవల ఆసుపత్రి తాత్కాలిక సూపరింటెండెంట్ ఆడిటింగ్ నిర్వహించగా ఈ బాగోతం బయటపడింది. ఆసుపత్రిలో 204 పడకలు ఉన్నప్పటికీ రోజుకు గరిష్ఠంగా 40-50 మంది మాత్రమే ఇన్‌పేషెంట్లుగా ఉంటారని సిబ్బంది చెబుతున్నారు. కాని 170-180 మందికి డైట్ ఇస్తున్నట్లు లెక్కల్లో చూపి అక్రమాలకు పాల్పడ్డారు. ప్రతి నెలా గరిష్ఠంగా రూ.4.6 లక్షల వరకు డైట్ బిల్లులు వస్తుండగా, అందులో సగం పక్కదారి పడుతోంది. ఈ వ్యవహారంపై ప్రస్తుతం విజిలెన్స్ దర్యాప్తు ప్రారంభమై పలువురు అధికారులకు నోటీసులు జారీ చేశారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బోగస్ ఓట్లను తొలగించాలి : మాజీ కార్పొరేటర్

వెంగళరావునగర్, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక త్వరలో జరగనున్న నేపథ్యంలో బోగస్ ఓట్లను తొలగించాలని మాజీ కార్పొరేటర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జి.మురళీగౌడ్ డిమాండ్ చేశారు. బిహార్‌లో ఓట్లు చోరీ కాకుండా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన ఓటర్ అధికార్ యాత్రకు మద్దతుగా మంగళవారం కృష్ణకాంత్ పార్క్ వద్ద ఒక వ్యక్తి ఒక ఓటు కార్యక్రమాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కూడా బోగస్ ఓట్లు చాలా ఉన్నాయని, ఓటరు గుర్తింపు కార్డులను ఆధార్ కార్డుతో లింక్ చేసి బోగస్ ఓట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఉప ఎన్నిక నోటిఫికేషన్ రాక ముందే ఎన్నికల సంఘం, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు టి.వినోద్ కుమార్, మహమ్మద్ గౌస్, నాగరాజు, అబ్దుల్ ఖాదర్, చంద్రమౌళి, కనకదుర్గ పాల్గొన్నారు.

ఓపెన్ వర్సిటీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో మంగళవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, రిటైలర్స్ అసోషియేషన్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో మంగళవారం "స్టైఫండ్ బేస్డ్ అప్రెంటిస్‌షిప్ ప్రోగ్రామ్" లో నమోదైన 200 మంది కోసం ఈ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో ఎంపికైన విద్యార్థులు సెప్టెంబర్ 1 నుంచి ఆయా సంస్థల్లో చేరేలా స్పాట్ ఆఫర్ లెటర్లు పొందారు. కొన్ని సంస్థలు ఎంపికతో పాటు విద్యార్థులకు వసతిని, భోజనాన్ని కూడా అందించనున్నాయి. మరో 15 రోజుల్లో 325 మందికి ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.


ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొన్న కంపెనీల ప్రతినిధులు

సీఎం ప్రజావాణికి 386 అర్జీలు

బేగంపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం ప్రజావాణికి మొత్తం 386 దరఖాస్తులొచ్చాయి. మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఇన్‌చార్జి డా. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ అర్జీలను స్వీకరించారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారం చూపాలన్నారు. కాగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 76, రెవెన్యూకు 35, ప్రవాసీ ప్రజావాణికి 2, విద్యుత్‌శాఖకు 29, ఇందిరమ్మఇళ్లకు 169, ఇతర శాఖలకు గాను75 అర్జీలు స్వీకరించామని ఒక అధికారి తెలిపారు.

అక్టోబరులో హైదరాబాద్ పికెల్‌బాల్ లీగ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ పికెల్‌బాల్ లీగ్ (హెచ్‌పీఎల్)ను వచ్చే అక్టోబరు 10 నుంచి నిర్వహించేందుకు రంగం సిద్ధమవుతోంది. 8 జట్లు ఇందులో పోటీ పడనున్నాయి. ప్రతీ జట్టులో 10 మంది ప్లేయర్లు ఉంటారు. రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో పోటీలు జరగనున్నాయి. నవంబరు 28న ఫైనల్ జరగనుంది. టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ రూ.12 లక్షలు.


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్

సమన్వయంతో ఏర్పాట్లు చేయాలి : ట్రాఫిక్ డీసీపీ

ఖైరతాబాద్, ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు జాగ్రత్తలు పాటిస్తూ నిర్ణయాలు తీసుకోవాలని ట్రాఫిక్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ సూచించారు. గణేష్ ఉత్సవాలు, నిమజ్జనోత్సవాల సందర్భంగా ఆయన ట్రాఫిక్ పోలీసు అధికారులతో కలిసి ఆయన ప్రత్యేక సమావేశమయ్యారు. జీ హెచ్‌ఎంసీ, విద్యుత్, ఆర్ అండ్ బీ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. భారీ గణపతి వద్ద, ఇతర పెద్ద మండపల వద్ద సరైన పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులతో సమన్వయం చేసుకొని చెట్ల కొమ్మలు నరికించాలన్నారు. రోడ్లపై ఉన్న గుంతలను, ఎత్తు వంపుల వద్ద కావాల్సిన ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు భారీ గణపతి వద్ద, నిమజ్జన ప్రాంతాల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ట్రాఫిక్ అదనపు డీసీపీ ఎ.రాములు, ఏసీపీలు మోహన్‌కుమార్, శ్రీనివాస్, సెంట్రల్ జోన్, ఈస్ట్ జోన్ల ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలలో ఫొటోగ్రఫీ దినోత్సవం

బేగంపేట , ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాలలో చిత్రంజన్ -2025 కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంతర్ కళాశాల ఫొటోగ్రఫీల పోటీ, ప్రదర్శన జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. ఉమా జోసెఫ్ మాట్లాడుతూ ఫొటో గ్రఫీ లేని రోజుల గురించి వివరించారు. అప్పట్లో ప్రజలు జ్ఞాపకాలను సజీవంగా ప్రతిదీ గుర్తు పెట్టుకోవాల్సి వచ్చేదన్నారు. ఒక ఫొటో కేవలం జ్ఞాపకాలనే కాకుండా ఒక కథను తెలియజేస్తుందన్నారు. అంతర్ కళాశాల ఫొటోగ్రఫీ పోటీ విజేతలకు ప్రఖ్యాత ఫొటోగ్రాఫర్, క్యూరేటర్, స్టోరీ టెల్లర్ ప్రశాంత్ మంచికంటి.. బహుమతులను అందజేశారు.

అరుదైన వ్యాధితో మహిళ మృతి

అమీర్ పేట,ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అరుదైన వ్యాధితో చికిత్స పొందుతూ ఓ మహిళ ఈఎస్ఐ ఆసుపత్రిలో మృతిచెందింది. సబ్‌ఇన్‌స్పెక్టర్ సుధీర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉప్పల్ చిలుకానగర్‌కు చెందిన షబానాబేగం(27)తో ప్రైవేటు ఉద్యోగి. 2022లో మహ్మద్ అలీముల్లాతో ఆమె వివాహమైంది. ఆమె చాలాకాలంగా ఇమ్యూనో థ్రోంబోసైటోపెనిక్ పర్పూర (ఐటీపీ) అనే అరుదైన వ్యాధితో బాధపడుతోంది. పైగా గర్భిణి దీంతో వైద్యచికిత్స కోసం ఈఎస్ఐలో చేర్చారు. వ్యాధి కారణంగా అవయవాలేవి పనిచేయకపోవడంతోపాటు రక్తస్రావం జరిగి మంగళవారం ఆమె మృతిచెందింది. ఈఎస్ఐ వైద్యాధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మూర్ఛతో ప్లంబర్ మృతి

అమీర్ పేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మూర్ఛతో ప్లంబర్ మృతిచెంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ సంఘటన ఎస్ఆర్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆబిడ్స్‌లోని చిరాగలీ లైన్‌కు చెందిన కె.విష్ణు అలియాస్ కృష్ణ (45) సెంట్రింగ్‌తో పాటు ప్లంబర్‌గా పనిచేస్తుంటాడు. మంగళవారం ఉదయం ఎస్ఆర్‌నగర్‌లోని ఓ టిఫిన్ సెంటర్‌కు రాగా ఈశ్వరప్రసాద్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఇంటికి పైకప్పు నుంచి వర్షపునీరు లోపలకు వస్తుందని ఈ పని కోసం తాను నివాసముంటున్న నెహ్రూనగర్‌కు తీసుకెళ్లాడు. ఇంటిపైకెక్కి పైపుల మరమ్మతు పనులు చేస్తుండగా స్పృహ లేకుండా విష్ణు పడి ఉన్నాడు. బీరంగూడలో తాను నిర్వహిస్తున్న టిఫెన్ సెంటర్ వద్దకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి ఈశ్వరప్రసాద్ చేరుకున్నాడు. ఇంటిపైకెళ్లి చూస్తే అతను పడి ఉండటాన్ని గుర్తించి వెంటనే 108కు సమాచారం ఇచ్చాడు. వారొచ్చి అతడిని పరిశీలించి మృతిచెందినట్లు తెలిపారు. కాగా మూర్ఛ కారణంగానే అతడు మృతిచెందాడని ఇన్‌స్పెక్టర్ అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసుకొని ఎస్ఆర్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

త్వరలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు.. : కార్పొరేటర్

వెంగళరావునగర్, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని బస్తీలు, కాలనిలలో దెబ్బతిన్న రహదారుల స్థానంలో కొత్తగా సీసీ రోడ్లు నిర్మించనున్నట్టు వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య అన్నారు. మంగళవారం మధురానగర్‌లోని తన కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఏఈ అవినాష్, అధికారులతో కలిసి ఆమె సమావేశమయ్యారు. జవహర్ నగర్ ప్రధాన రహదారి, కళ్యాణ్ నగర్ వెంచర్-1లలో నూతన రహదారుల కోసం నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. మసీదుగడ్డ మార్కెట్ నుంచి ఐస్ క్రీమ్ పార్లర్ వరకు 1.10 కోట్ల రూపాయలతో త్వరలో సీసీ రోడ్డు వేయనున్నట్టు వెల్లడించారు. వీడియో గల్లీ, తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్‌ను కోరనున్నట్టు తెలిపారు. సమావేశంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

పేదలకు అండ సీఎం రిలీఫ్ ఫండ్ : ఎమ్మెల్యే

మారేడుపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఆర్థిక ఇబ్బందుల కారణంతో వైద్యం చేయించుకునే విషయంలో అశ్రద్ధ చూపవద్దని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. మంగళవారం వెస్ట్ మారేడుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 15 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.4.62 లక్షల విలువైన ఆర్థిక సహాయం చెక్కులను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషు కుమారి, నాయకులు శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, నాగులు, అశోక్ యాదవ్, లక్ష్మీపతి, మహేష్ యాదవ్, గోపిలాల్ చౌహాన్, కూతురు నర్సింహ, బలరాం, సత్యనారాయణ, అబ్బాస్, హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రోత్సాహం అందిస్తాం..

అంతర్జాతీయ స్థాయిలో సైతం సత్తా చాటి హైదరాబాద్ నగరానికి గుర్తింపు తీసుకురావాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆకాంక్షించారు. సనత్‌నగర్‌లోని వాల్మీకి వ్యాయామశాలకు చెందిన రవిసింగ్, ప్రియాంక పట్నాయక్‌లు పవర్‌లిఫ్టింగ్‌లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన సందర్భంగా మంగళవారం వెస్ట్ మారేడుపల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే వారిని అభినందించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొని మరిన్ని మెడల్స్‌ను సాధించాలని అన్నారు.



మల్లారెడ్డి, ఆయన సతీమణి కల్పనరెడ్డిలను కలిసిన నాయకులు

మట్టి గణపతులను పూజించాలి

బోయినపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణలో భాగంగా రానున్న గణపతి పండుగను పురస్కరించుకుని బోయినపల్లిలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేసినట్లు మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం మల్లారెడ్డి, కల్పనరెడ్డి దంపతులను పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని సూచించారు. వినాయకులను తరలించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. పూజకు మట్టి విగ్రహాలే వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టింకు గౌడ్, భాస్కర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చౌరస్తా అభివృద్ధికి చర్యలు : కార్పొరేటర్

చిలకలగూడ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ చౌరస్తాను సుందరీకరించటానికి చర్యలు చేపడుతున్నట్లు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత తెలిపారు. సికింద్రాబాద్ శాసనసభ్యుడు పద్మారావు గౌడ్ సూచనల మేరకు మంగళవారం బేగంపేట సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్రమణ్యం, గోపాలపురం ట్రాఫిక్ సీఐ భాస్కర్, ట్రాఫిక్ ఇంజనీరింగ్ సీఐ సురేంద్రలతో కలిసి ఐలాండ్ నిర్మాణానికి అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించారు. చిలకలగూడ చౌరస్తా ఆరు రోడ్ల కూడలి. గాంధీ ఆస్పత్రికి వెళ్లే రోగులు, సికింద్రాబాద్ స్టేషన్ వెళ్లే ప్రయాణీకులు, సంగీత్ వైపునకు వెళ్లే వాహన, పాదచారులతో నిత్యం కిటకిటలాడుతూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించారు.



శ్రమదానం.. గుంతల పూడ్చివేత

తిరుమలగిరి ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు బొల్లారం లకడావాల నుంచి రిసాలబజార్ వరకు గల ప్రధాన రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. దీంతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవీ బాల్‌రాజ్, కన్నన్‌లు మంగళవారం శ్రమదానంలో భాగంగా ఆదిత్య బ్యాంక్ కాలనీ వద్ద ఉన్న గుంతలను పూడ్చివేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం



ఎల్లయ్య (ఫైల్)

బౌద్ధనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భిక్షాటన చేసే వృద్ధుడు అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిలకలగూడ దూద్‌బావికి చెందిన ఎం.ఎల్లయ్య(60)కు ఇద్దరు కుమార్తెలు. పది సంవత్సరాల క్రితం భార్య మృతి చెందటంతో అప్పటి నుంచి సీతాఫల్‌మండి చౌరస్తాలో భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఎల్లయ్యకు మానసిక పరిస్థితి బాగోలేదు. ఈ నెల 17న మధ్యాహ్నం ఒంటిగంటకు ఇంటి నుంచి వెళ్లిన ఎల్లయ్య తిరిగి రాలేదు. దీంతో కుమార్తె గుప్పల స్వరూప తన తండ్రి కనిపించటం లేదని సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



శ్రీనివాస్ (ఫైల్)

బౌద్ధనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రి నుంచి ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినపల్లి మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన దుమ్మాల శ్రీనివాస్(40) స్వీపర్‌గా పనిచేస్తుంటాడు. అనారోగ్యంగా ఉండటంతో చికిత్స నిమిత్తం శ్రీనివాస్‌ను భార్య లక్ష్మీ గాంధీ ఆస్పత్రికి తీసుకవచ్చింది. ఓపీ తీసుకుని ఒకటో అంతస్తులో న్యూరోసర్జరీ వార్డు క్యూలో నిల్చున్నారు. శ్రీనివాస్ బాత్‌రూమ్‌కి వెళ్లివస్తానని భార్యకు చెప్పి తిరిగి రాలేదు. అతడి కోసం ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేదు. దీంతో తన భర్త కనిపించటం లేదని భార్య సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మోసం కేసులో నలుగురికి జైలు శిక్ష

మారేడుపల్లి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తిని మోసం చేసిన కేసులో నలుగురికి జైలుశిక్ష, జరిమానా విధించిన ఘటన మారేడుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మారేడుపల్లి సీఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం మారేడుపల్లికి చెందిన ముకేష్‌శర్మ అనే వ్యక్తిని ప్రభుత్వం నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు ఇప్పిస్తామని, నకిలీ పత్రాలు చూపించి బి.శ్రవణ్ కుమార్, బి.తులసి లత, బి.లలిత్ కుమార్, కె.ఎన్.శర్మలు తన వద్ద రూ.66 లక్షల డబ్బు కాజేసి మోసం చేశారని బాధితుడు మారేడుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. కోర్టులో కేసు కొనసాగుతుండగా బాధితుడి నుంచి చెక్కు రూపంలో రూ.66 లక్షలు కాజేశారు. వాదనల అనంతరం సికింద్రాబాద్ కోర్టు వారికి జైలుశిక్ష, ఒక్కొక్కరికి రెండువేల రూపాయల జరిమానాను విధించింది.



పార్కులో పేరుకుపోయిన చెత్తా చెదారం



నిరుపయోగంగా మారిన ఆట పరికరం

పార్కును అభివృద్ధి చేయండి

- అధ్వానంగా బొల్లారంలోని పార్కు
- అధికారుల బాధ్యతారాహిత్యం
- శిథిలావస్థలో ఆట పరికరాలు
- మౌలిక వసతులు కరువు

తిరుమలగిరి ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గతం ఎంతో ఘనం.. నేడు శూన్యం అన్నచందంగా మారింది బొల్లారంలోని కంటోన్మెంటు పార్కు దుస్థితి. ఒకానొకప్పుడు పచ్చదనంతో కళకళలాడిన పార్కు నేడు దుమ్ము ధూళితో దర్శనం ఇస్తుంది. సుమారు మూడు ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన పార్కు పచ్చదనంతో పరిఢవిల్లేది. బొల్లారం పరిసర ప్రాంతాలైన అల్వాల్, మచ్చబొల్లారం ప్రాంతాలకు చెందిన మహిళలు, చిన్నారులు పార్కుకు వచ్చి ప్రకృతిని ఆస్వాదించేవారు. స్వచ్ఛమైన గాలిని పీల్చుకుని వ్యాయామంతో పాటు కుటుంబ సభ్యులతో వాకింగ్ చేస్తూ ఉంటారు. అయితే మౌలిక వసతులు, నిర్వహణ సరిగా లేకపోవడంతో రోజురోజుకూ సందర్శకులు తగ్గుతున్నారు. దీంతోపాటు అధికారుల నిర్లక్ష్యం వల్ల పార్కుకు వచ్చే పౌరులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన ఆట పరికరాలు కొన్ని విరిగిపోవడంతో మూలకు పడవేశారు. దీంతో పాటు మూత్రశాలలు కూడా సరిగా లేకపోవడంతో పాటు దుర్గంధం వెదజల్లడంతో పార్కుకు వచ్చినవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూత్రశాలలకు తలుపులు లేవు, అలాగే స్త్రీలు, పురుషులు అనే సూచిక బోర్డు లేకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంటుంది. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా కంటోన్మెంటు పార్కు తయారైందని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతోపాటు పార్కులో చెత్త చెదారం దర్శనం ఇస్తుంది. ఆ చెత్తలో పాములు తిరుగుతుండటంతో పార్కుకు వచ్చేవారు భయాందోళనకు గురవుతున్నారు.

వసతులు కల్పించండి



ఒకప్పుడు పచ్చదనంతో సందర్శకులతో ఈ పార్కు కళకళలాడేది. ప్రస్తుతం సరైన నిర్వహణకు నోచుకోక కొట్టుమిట్టాడుతుంది. పార్కుకు వెళ్లే పౌరులకు మౌలిక వసతులు లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పార్కు సమయాలు తెలిపే సూచిక బోర్డులు కూడా లేక ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే వసతులు కల్పించాలి.

\- వేణు

తలుపులు ఏర్పాటు చేయండి



పార్కులో ఏర్పాటు చేసిన టాయిలెట్స్‌కు తలుపులు లేకపోవడంతో మహిళలు ఇబ్బందులను ఎదుర్కుంటున్నారు. దీంతో పాటు టాయిలెట్స్‌కు సూచిక బోర్డులు లేక పోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తలుపులు ఏర్పాటు చేసి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

\- రాజేష్

శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి

- ఏసీపీ గోపాల్ కృష్ణమూర్తి

బోయినపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ప్రశాంత వాతావరణంలో, మత సామరస్యంతో పండుగలను జరుపుకోవాలని బేగంపేట్ ఏసీపీ గోపాల కృష్ణమూర్తి తెలియచేశారు. 27 నుంచి గణపతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు బేగంపేట్ ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, బోయిపల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజులు ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ మాట్లాడారు. ప్రతి ఒక్కరు సంయమనం పాటించాలని, ఒకరి మతాన్ని ఇంకోకరు గౌరవించుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ పోలీసులకు సహకరిస్తూ పండుగలు జరుపుకోవాలని సూచించారు. అలాగే సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను ఎవ్వరూ నమ్మవద్దన్నారు. ఏవైనా సంఘటనలు జరిగితే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, కేసులు కూడా నమోదు చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. అవాంతరాలు, అల్లర్లు జరుగకుండా కమిటీ పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. లౌడ్ స్పీకర్లు డీజేలు వంటివి నిషేధించడం జరిగిందని, వీటి అనుమతి కావాలంటే ముందస్తుగా ఏసీపీకి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా విగ్రహాలను తరలిస్తున్న మార్గంలో విద్యుత్ తీగలను ముందే గుర్తించి తగిన జాగ్రతలు తీసుకుని ముందుకు సాగాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నిబంధనలు పాటించాలి



మండపాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు నిబంధనలు పాటించాలి. అలాగే పోలీసు అనుమతులు తీసుకోవాలి. శాంతి సామరస్యాన్ని పాటిస్తూ, సోదరభావంతో అందరూ కలిసి మెలిసి ఉత్సవాలను జరుపుకోవాలి. ఉత్సవ కమిటీ సభ్యులు మండపాల వద్ద అందుబాటులో ఉండాలి.

\- గోపాల కృష్ణమూర్తి, ఏసీపీ

పోలీసులకు సహకరించాలి



ఇతరులకు ఇబ్బందులు కలుగకుండా పండుగలు జరుపుకోవాలి. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. నిబంధనల ప్రకారం అనుమతులు పొందాలి. మండపాల నిర్వాహకులు అందుబాటులో ఉండాలి.

\- తిరుపతి రాజు, ఇన్‌స్పెక్టర్, బోయినపల్లి

వర్షపు నీటి పైపులైన్లను ఏర్పాటు చేయండి

మారేడుపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మోండా డివిజన్ పరిధిలోని వెస్ట్ మారేడుపల్లి నెహ్రూనగర్ ప్లే గ్రౌండ్‌లో వర్షం కురిసిన సమయంలో ప్లేగ్రౌండ్ మొత్తం వరదనీటితో కుంటను తలపిస్తుంది. దీంతో క్రీడల్లో శిక్షణ తీసుకోవడానికి వచ్చిన క్రీడాకారులు నిలిచి ఉన్న వరద నీటిని చూసి అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. వేసవికాలంలో జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో జరిగే క్రీడా పోటీలకు శిక్షణ పొందే క్రీడాకారులు ఇలాంటి ఆటంకాలతో మెరుగ్గా క్రీడల్లో రాణించలేక, డబ్బులు చెల్లించి ప్రైవేట్ కోచింగ్‌లకు వెళుతూ వారి నైపుణ్యాన్ని చాటి చెప్పుకునే ప్రయత్నం కొనసాగిస్తుంటారు. ఇప్పటికైనా క్రీడా మైదానాలకు వసతులు కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు వారి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



వర్షపు నీటితో నిండిన ప్లేగ్రౌండ్



టీచర్స్ కాలనీ నుంచి దిగువ ప్రాంతమైన అంబేడ్కర్‌నగర్ బస్తీలో వరద, డ్రైనేజీ మురుగు ఏరులై పారుతున్న దృశ్యం

సమస్యను పట్టించుకోవడం లేదని స్థానికుల ఆగ్రహం

మారేడుపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : కాలంతో సంబంధం లేకుండా మోండా డివిజన్ పరిధిలోని ఈస్ట్ మారేడుపల్లి టీచర్స్ కాలనీలో మ్యాన్‌హోళ్ల నుంచి డ్రైనేజీ మురుగు రోడ్లపై ఏరులై పారుతుంది. అప్పటి జన అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థ ఇప్పటి అవసరాలను తీర్చక ఒత్తిడి ఏర్పడడంతో డ్రైనేజీ మురుగునీరు మ్యాన్ హోళ్ల నుంచి చిమ్ముతూ రోడ్లమీద పారుతుంది. దీంతో వ్యర్థ పదార్థాలు బయట పడుతూ పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. అదేవిధంగా దుర్వాసన వెదజల్లుతోంది. ఈస్ట్ మారేడుపల్లి టీచర్స్ కాలనీ సంగీత్ చౌరస్తా ఎత్తయిన ప్రాంతాల నుంచి వర్షం కురిసిన సమయంలో దిగువ ప్రాంతాలైన అంబేడ్కర్‌నగర్ బస్తీ మొదలైనవి వరద నీటి ప్రవాహంతో కొట్టుమిట్టాడుతున్నాయి. దీంతో రెండు రోజుల వరకు ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్థానిక బస్తీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం ప్రజావాణికి 386 అర్జీలు

బేగంపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం ప్రజావాణికి మొత్తం 386 దరఖాస్తులు వచ్చాయి. మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఇన్‌చార్జి డా. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లు వాటిని స్వీకరించారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారం చూపాలన్నారు. కాగ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 76, రెవెన్యూకు 35, ప్రవాసీ ప్రజావాణికి 2, విద్యుత్‌శాఖకు 29, ఇందిరమ్మఇళ్లకు 169, ఇతర శాఖలకు గాను75 అర్జీలు స్వీకరించామని ఒక అధికారి తెలిపారు.

ఎర్రగడ్డ ఆయుర్వేద ఆస్పత్రిలో నిధుల గోల్‌మాల్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో రోగుల డైట్ పేరుతో లక్షల రూపాయల గోల్‌మాల్ జరిగిన ఉదంతం ఆలస్యంగా వెలుగుచూసింది. ఇటీవల ఆసుపత్రి తాత్కాలిక సూపరింటెండెంట్ ఆడిటింగ్ నిర్వహించగా ఈ భాగోతం బయటపడింది. ఆసుపత్రిలో 204 పడకలు ఉన్నప్పటికీ రోజుకు గరిష్ఠంగా 40-50 మంది మాత్రమే ఇన్‌పేషెంట్లుగా ఉంటారని సిబ్బంది చెబుతున్నారు. కాని 170-180 మందికి డైట్ ఇస్తున్నట్లు లెక్కల్లో చూపి అక్రమాలకు పాల్పడ్డారు. ప్రతి నెలా గరిష్ఠంగా రూ.4.6 లక్షల వరకు డైట్ బిల్లులు వస్తుండగా, అందులో సగం పక్కదారి పడుతోంది. ఈ వ్యవహారంపై ప్రస్తుతం విజిలెన్స్ దర్యాప్తు ప్రారంభమై పలువురు అధికారులకు నోటీసులు జారీ చేశారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టండి

తార్నాక, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : తార్నాక డివిజన్ మాణికేశ్వర్ నగర్‌లో తరచూ డ్రైనేజీ సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాలని బీఆర్‌ఎస్ పార్టీ హైద్రాబాద్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆలకుంట హరి జలమండలి అధికారులను కోరారు. మాణికేశ్వర్ నగర్‌లో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందించాలని స్థానిక ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు మంగళవారం జలమండలి మేనేజర్ వినయ్ తమ సిబ్బందితో కలిసి పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా భారీ వర్షాలు కురిసినప్పుడల్లా డ్రైనేజీలు ఉప్పొంగటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, 30 సంవత్సరాల క్రిందటి డ్రైనేజీ వ్యవస్థకావడంతో తరచూ డ్రైనేజీ సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుందని కొత్త డ్రైనేజీ వ్యవస్థను రూపొందించాలని, ఇదే విషయాన్ని గతంలో ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకువెళ్లడం జరిగిందని అధికారులకు వివరించారు. దాంతో స్పందించిన అధికారులు డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాణికేశ్వర్ నగర్ వెల్ఫేర్ అధ్యక్షుడు సత్యనారాయణ, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఓర్సు కృష్ణ, బాలకృష్ణ గౌడ్, వరికుప్పల పరమేష్, వేముల కృష్ణ, బోదాసు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



మాణికేశ్వర్‌నగర్‌లో డ్రైనేజీ వ్యవస్థను పరిశీలిస్తున్న జలమండలి మేనేజర్ వినయ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ సైదయ్య

వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- మహంకాళి ఏసీపీ సైదయ్య

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రాబోయే వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని మహంకాళి ఏసీపీ సైదయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురామ్ ఆధ్వర్యంలో వినాయక మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏసీపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే మండపాల నిర్వాహకులు ముందస్తుగా తమ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో సమాచారమిస్తే బందోబస్తు ఏర్పాటు చేసుకునే వీలుంటుందన్నారు. ఇన్‌స్పెక్టర్ పరశురామ్ మాట్లాడుతూ మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఏదైనా ఘటన సంభవిస్తే తమ సెక్టార్ ఎస్సైలకు కాని ఉత్సవాలకు సంబంధించిన గ్రూపులో కాని తెలపాలని సూచించారు.

కార్పొరేటర్‌కు పీహెచ్‌డీ పట్టా



ఉస్మానియా యూనివర్శిటీ ఠాగూర్ ఆడిటోరియంలో మంగళవారం జరిగిన 84వ స్నాతకోత్సవంలో పాల్గొని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకున్న సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ.

\- బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి



శాకాంబరి అలంకారంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి

శాకాంబరి అలంకారంలో అమ్మవారు

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసం చివరి మంగళవారం సందర్భంగా సికింద్రాబాద్‌లోని ఆవులమందలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు శాకాంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వివిధ రకాల కూరగాయలతో బాలాలయంలోని అమ్మవారిని అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి వచ్చి సామూహిక కుంకుమార్చనలో పాల్గొని ఒకరికొకరు పసుపు బొట్టు, వాయినాలను ఇచ్చి పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు చందా బాలేందర్, ప్రధాన కార్యదర్శి తమ్మి వెంకటేష్, కోశాధికారి మనుసాని శరత్‌కుమార్‌లతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ఏర్పాట్లను చేశారు.

ఓపెన్ వర్సిటీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో మంగళవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, రిటైలర్స్ అసోషియేషన్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో 'స్టైపండ్ బేస్డ్ అప్రెంటీస్‌షిప్ ప్రోగ్రామ్'లో నమోదైన 200 మందికి ఈ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో ఎంపికైన వారు సెప్టెంబరు 1 నుంచి ఆయా సంస్థల్లో చేరేలా స్పాట్ ఆఫర్ లెటర్లు పొందారు. వారికి కొన్ని సంస్థలు వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నాయి. మరో 15 రోజుల్లో 325 మందికి ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

సంపులో పడిన వ్యక్తిని కాపాడిన హైడ్రా

- చికిత్స నిమిత్తం గాంధీకి తరలింపు

అడ్డగుట్ట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి ఆవరణలో నిర్మాణంలో ఉన్న సంపులో పడి గాయాలపాలైన వ్యక్తిని హైడ్రా కాపాడింది. మంగళవారం ఉదయం అక్కడి వారు గ్రహించి హైడ్రా డీఆర్‌ఎఫ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వగానే రెస్క్యూ టీం ఇన్‌చార్జి స్వామి నేతృత్వంలోని బృందం వెళ్లి అతడిని కాపాడింది. కవాడిగూడకు చెందిన హరీష్ (35)గా గుర్తించారు. సోమవారం రాత్రి ఎప్పుడో తాగిన మత్తులో పడిపోయి ఉంటాడని భావిస్తున్నారు. గాంధీ ఆసుపత్రిలో సంపు నిర్మాణం జరుగుతోంది. ఆ ఐరన్ చువ్వలు ఎత్తుగా ఉండడంతో బయటకు వచ్చే ప్రయత్నంలో గాయాలపాలయ్యాడు. సైడ్‌వాల్ కోసం ఏర్పాటు చేసిన ఇనుప చువ్వలను కట్ చేసి గాయపడిన వ్యక్తిని హైడ్రా సిబ్బంది కాపాడారు. గాయపడిన వ్యక్తిని చిలకలగూడ పోలీసులకు అప్పగించారు. తర్వాత గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం గాంధీలో చికిత్స పొందుతున్నారని హైడ్రా డీఆర్‌ఎఫ్ సిబ్బంది తెలిపారు.

22న అథ్లెటిక్స్ ట్రయల్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ ట్రయల్స్‌ను ఈనెల 22వ తేదీన నిర్వహించనున్నారు. బాలబాలికలకు అండర్-14, 16, 18, 20 విభాగాల్లో ఉదయం 6.30 గంటల నుంచి సికింద్రాబాద్ జింఖానా మైదానంలో ఈ ట్రయల్స్ జరగనున్నాయి. ఇందులో ప్రతిభ కనబర్చిన వారిని ఈ నెల 30, 31వ తేదీల్లో పాలమూరు యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. మరిన్ని వివరాల కోసం 837471589 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.